
సాక్షి
వరంగల్
గురువారం । 5 । జనవరి । 2023



గీసుకొండ జాతరకు వేళాయె

గీసుకొండ మండల కేంద్రం శివారు నల్లరాతి గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి జాతర ఈనెల 6, 7, 8వ తేదీల్లో వైభవంగా సాగనుంది. - 8లో▸



పంట పరిహారం విడుదల

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కురిసిన వడగండ్ల వాన, ఈదురు గాలులతో దెబ్బతిన్న మొక్కజొన్న, మిర్చి పంటలకు పరిహారం విడుదలైంది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0⁰ /19.0⁰

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టీచర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా..



నర్సంపేట: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు, బదిలీలు, పదోన్నతుల అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డితో కలిసి సంఘం నల్లబెల్లి మండల క్యాలెండర్, రాష్ట్ర క్యాలెండర్లను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సంఘం నల్లబెల్లి మండల శాఖ అధ్యక్షుడు నకిరెడ్డి మహేందర్, ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామచంద్రు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పీరాల మల్లయ్య, జిల్లా బాధ్యులు కె.నాగరాజు, లాక్య నాయక్, వెంకట్రామనర్సయ్య, మండల సీనియర్ ఉపాధ్యాయులు భద్రినాథ్, మండల బాధ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష నిర్వహణపై విచారణ చేపట్టాలి

కాశీబుగ్గ/కాజీపేట సెంటర్: అధికారుల నిర్లక్ష్యం వల్ల గత నెల 18న నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో అనేక అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ రావు కె.యాకయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శంభునిపేట పరీక్ష కేంద్రంలోని కొన్ని గదుల్లో కొందరు ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు జవాబులు చెప్పడం వల్ల మిగతా విద్యార్థులు నష్టపోయారని పేర్కొన్నారు. సెల్ఫ్ సెంటర్ ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించడం వల్లే అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు.

ఆదిలాబాద్‌కు బస్సు సర్వీస్



నర్సంపేట: నర్సంపేట ఆర్టీసీ డిపో నుంచి ఆదిలాబాద్‌కు నూతన బస్సు సర్వీస్‌ను డిపో మేనేజర్ విజయమాధురి ఆదేశాల మేరకు ఎంఎఫ్ అమల బుధవారం ప్రారంభించారు. నర్సంపేట నుంచి వరంగల్, హనుమకొండ, కరీంనగర్, లక్సెట్టిపేట, జన్నారం, ఉట్నూరు ద్వారా ఆదిలాబాద్ చేరుకుంటుందని డిపో ట్రాఫిక్ సూపరింటెండెంట్ సీతారామయ్య తెలిపారు. బస్సు సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వండర్ హాట్ మిర్చి క్వింటా ధర రూ.36వేలు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వండర్ హాట్ మిర్చి క్వింటా ధర రూ.36వేలు పలికిందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్ తెలిపారు. యూఎస్–341 రకం రూ.26,100, తేజ రూ.20,500, తేజ(కోల్డ్ స్టోరేజీ) రూ.19,500, తాలు మిర్చి క్వింటా ధర రూ.11వేలు పలికిందని, మొత్తం 2,285 బస్తాల మిర్చి అమ్మకానికి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే పత్తి క్వింటా ధర రూ.8,310 పలికిందని, 2,344 బస్తాలు విక్రయానికి వచ్చినట్లు తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గీసుకొండ: జిల్లాలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) 38 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేయడానికి బుధవారం కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద ఎంబీబీఎస్/బీఏఎంఎస్/స్టాఫ్‌నర్సు కోర్సులు పూర్తి చేసిన అర్హత గల అభ్యర్థులు ఈనెల 7వ తేదీలోపు తమ కార్యాలయంలో సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కాళేశ్వరం, బాసర, రాజన్న, భద్రాద్రి జిల్లా(మల్టీజోన్–1)లో స్థానికత కలిగి ఉండి.. బీఎస్సీ నర్సింగ్/జీఎన్‌ఎం కమ్యూనిటీ హెల్త్ అర్హత కలిగిన అభ్యర్థులు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ(జోన్–4) స్థానికత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీఎస్://వరంగల్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు పొందుపరిచారని ఆయన పేర్కొన్నారు.

నెక్స్ట్ ఎవరు

తాజాగా నర్సంపేట ఏఎస్‌ఐ నాగరాణిపై సస్పెన్షన్ వేటు

సాక్షిప్రతినిధి, వరంగల్:

వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు దారి తప్పుతున్నారు. ప్రేమాయణం సాగిస్తూ, ఆర్థిక లావాదేవీల్లో చొరబడుతూ అడ్డంగా దొరికిపోతున్నారు. హద్దులు దాటి ప్రవర్తించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని దారిలో పెట్టాల్సిన పోలీసులే అడ్డదారులు తొక్కుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొందరు పోలీసుల అతిప్రవర్తనతో అందరికీ చెడ్డ పేరు వస్తుందన్న ఆవేదన కూడా ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. దీంతో సొంత శాఖను గాడిలో పెట్టే పనిలో పడిన సీపీ ఏవీ రంగనాథ్‌కు పోలీసుల బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక లావాదేవీల వివాదంలో చిక్కుకున్న నర్సంపేట ఏఎస్‌ఐ నాగరాణిని సీపీ బుధవారం సస్పెండ్ చేశారు. కాగా.. గతంలో లైంగిక వేధింపుల ఫిర్యాదులుండి పెండింగ్‌లో ఉన్న ఓ సబ్ డివిజన్‌స్థాయి అధికారితోపాటు మరో ఇద్దరు సీఐలపైనా విచారణ జరుగుతోందన్న చర్చ ఆ శాఖలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.



గత నెల 24న అటాచ్.. ఇప్పుడు సస్పెన్షన్

నర్సంపేట రూరల్: నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న నాగరాణి ఒకరి వద్ద డబ్బులు తీసుకుని ఇవ్వకపోవడంతో సదరు బాధితులు 2021లో హనుమకొండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెపై చీటింగ్ కేసు నమోదు చేయడంతోపాటు డిసెంబర్ 24న సీపీ రంగనాథ్ సీఏఆర్‌కు అటాచ్ చేశారు. విచారణలో ఆమెపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో సీపీ బుధవారం సస్పెన్షన్ వేటు వేశారు.



- ఆర్థిక లావాదేవీలే కారణం..
- 48 గంటల్లో ఓ సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ఓ ఏఎస్‌ఐపై చర్యలు
- మరో ముగ్గురిపైనా విచారణ?
- లైంగిక వేధింపుల ఫిర్యాదులే నేపథ్యం
- కమిషనరేట్ పరిధిలో దారితప్పుతున్న పోలీసులు

సీఐ ట్రాప్‌లో పడి సస్పెన్షన్ వరకు..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొందరు పోలీస్ అధికారుల ప్రవర్తన పోలీస్ డిపార్ట్‌మెంట్ పరువు తీయడంతోపాటు ఉద్యోగాలు పోగొట్టుకునే పరిస్థితికి దారి తీస్తోంది. గీసుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, దామెర ఎస్‌ఐ హరిప్రియను ప్రేమాయణంలోకి దింపిన విషయం తెలిసిందే. 15 రోజుల క్రితమే హరిప్రియకు కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో వివాహం కాగా.. సీఐ ట్రాప్‌లో పడిన హరిప్రియను డిసెంబర్ 30న గమనించిన భర్త సీపీకి ఫిర్యాదు చేశారు. విచారణ చేయించిన సీపీ రంగనాథ్.. సీఐ, ఎస్‌ఐని సస్పెండ్ చేశారు. హరిప్రియ అత్తగారింట్లో ఉన్న సమయంలోనూ సీఐ వెంకటేశ్వర్లు సెల్‌ఫోన్ చాటింగ్‌లు, వీడియో కాల్స్ చేయడంతో వ్యవహారం బట్టబయలై సస్పెన్షన్ వరకు వెళ్లడంతో ఆమె కుటుంబం వీధిన పడే పరిస్థితి ఏర్పడింది. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిరలో నిరుపేద కుటుంబానికి చెందిన హరిప్రియకు తల్లి, ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. తండ్రి చనిపోయారు. ఇప్పుడు ఉద్యోగం పోయే పరిస్థితి వచ్చింది.

'పక్క' తొక్కుతున్న పోలీసులతో అప్రతిష్ట..

వివాహేతర సంబంధాలతో కొందరు పోలీసుల తీరు ఆ శాఖను అప్రతిష్టపాలు చేస్తున్నారు. రెండు మాసాల క్రితం సీబీసీఐడీలో పనిచేసే సీఐ రవి.. మరో మహిళా సీఐ మధ్య ఉన్న బండారం బయటపడింది. మహిళా సీఐ భర్త కూడా సర్కిల్ ఇన్‌స్పెక్టరే కావడం విశేషం. ఆ ఘటన మరిచిపోకముందే మరో సీఐ, మహిళా ఎస్‌ఐతో ప్రేమాయణం సాగించి సస్పెన్షన్‌కు గురికావడం విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా ఆర్థిక లావాదేవీల ఆరోపణలపై నర్సంపేట ఏఎస్‌ఐ నాగరాణిని సీపీ రంగనాథ్ బుధవారం సస్పెండ్ చేయగా.. తర్వాత వరుసలో ఎవరో?నన్న చర్చ సర్వత్రా సాగుతోంది.

'అధికారం' అండతో ఇష్టారాజ్యం..!

- గీసుకొండ ఇన్‌స్పెక్టర్ తీరుపై సర్వత్రా విమర్శలు
- సీపీ చర్యపై హర్షిస్తున్న ప్రజలు
- పలు గ్రామాల్లో బాణసంచా కాల్చి సంబురాలు

- వరంగల్‌క్రైం/గీసుకొండ

- 8లో▸

వైద్యపరంగా అభివృద్ధి చేస్తా..

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ప్రారంభించిన హెల్త్ సబ్ సెంటర్ ఎదుట సిబ్బందితో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

చెన్నారావుపేట: నియోజకవర్గాన్ని వైద్యపరంగా అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఉప్పరపల్లి గ్రామంలో పల్లె దవాఖాన హెల్త్ సబ్ సెంటర్, మన ఊరు–మన బడి అభివృద్ధి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తగా 59 హెల్త్ సబ్ సెంటర్లను మంజూరు చేశామన్నారు. రూ.68కోట్లతో 250 పడకల జిల్లా ఆస్పత్రి పనులు చేపట్టామన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద నియోజకవర్గంలో 104 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. వాటి పనుల కోసం రూ.30కోట్లు విడుదల చేశామన్నారు. ఉప్పరపల్లి పాఠశాలలో అదనపు తరగతి గదుల కోసం రూ.1.07కోట్లు మంజూరు చేశామన్నారు. అనంతరం విద్యార్థులకు అందించిన సోలార్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదావత్ విజేందర్, జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్, ఎంపీడీఓ కూచన ప్రకాశ్, డాక్టర్ సరోజ, డాక్టర్ సుమన్, మండల నోడల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ గఫార్, సొసైటీ చైర్మన్ మురహరి రవి, వైస్ చైర్మన్ చింతకింది వంశీ, ఎంపీటీసీలు చెరుకుపెల్లి విజేందర్‌రెడ్డి, గుండాల మహేందర్, రమేశ్, సర్పంచ్ కుండె మల్లయ్య, జున్నూతుల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో పోరాటానికి సిద్ధమవ్వాలి



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్‌విప్ వినయ్ తదితరులు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి

హన్మకొండ: విద్యుత్ కార్మికులు తెలంగాణ ఉద్యమం వంటి మరో పోరాటానికి సిద్ధం కావాలని, దేశవ్యాప్త కార్మిక లోకానికి తెలంగాణ విద్యుత్ కార్మికులు నాయకత్వం వహించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డు, సహకార నగర్‌లోని విష్ణుప్రియ గార్డెన్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ –1104 క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని యూనియన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించాలని చూస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణకు ఒప్పుకునేది లేదన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, టీఎస్ ఎస్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం

- ఏడుగురు విద్యార్థులు డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్సీ తదితర కోర్సుల 5వ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 137 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. పలు పరీక్ష కేంద్రాలను కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారులు జి.మధుకర్, ఎ.నరేందర్ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ ఏడుగురు విద్యార్థులు స్క్వాడ్‌కు పట్టుబడి డీబార్ అయ్యారు. నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఇచ్చోడ ఛత్రపతి కళాశాలలో ఒకరు, ఇచ్చోడ వివేకానంద కళాశాలలో ఐదుగురు కాపీయింగ్ చేస్తూ పట్టుబడి డీబార్ అయినట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, ఎ.నరేందర్ తెలిపారు. కాగా.. ఈనెల 5 నుంచి మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



హనుమకొండలో పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న యూనివర్సిటీ అధికారులు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి

నర్సంపేట రూరల్/నల్లబెల్లి/గీసుకొండ/దుగ్గొండి: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడంతోపాటు కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ ఉమెన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని హనుమాన్ దేవాలయం ప్రాథమిక పాఠశాల, నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, దుగ్గొండి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలను ఆయన డీఈఓతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. అలాగే గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్ల పీఎస్‌తోపాటు మనుగొండ యూపీఎస్‌లలో చేపట్టిన పనులను ఆయన కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీఈఓ వాసంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల స్థితిగతులను పరిశీలించి, కావాల్సిన మౌలిక సదుపాయాల వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాలకు తప్పనిసరిగా మిషన్ భగీరథ నీటిని అందిస్తామన్నారు. హైస్కూల్‌లో ప్రత్యేకంగా డైనింగ్ హాల్, విద్యార్థులు చదువుకోవడానికి అదనపు తరగతి గదులు నిర్మిస్తామన్నారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. దాతల సహకారంతో పాఠశాలలను మరింతగా అభివృద్ధి చేసేందుకు ఎస్‌ఎంసీలు కృషి చేయాలని సూచించారు. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంఎన్‌ఓ గుడిపూడి రాంచందర్‌రావు, నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గుంటి రజనీకిషన్, ఈఈ జాలి నరేందర్‌రెడ్డి, డీఈలు రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎంఈఓ చదువుల సత్యనారాయణ, ఏఈ చందర్‌రావు, సర్పంచ్ నానబోయిన రాజారాం, ఎస్‌ఎంసీ చైర్మన్ సట్ల రమేశ్, హెచ్‌ఎంలు రామస్వామి, రాజేశ్వరి, రావుల దేవేందర్, సతీశ్‌కుమార్, పోరిక స్వరూప, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ : మొగిలిచర్ల పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ గోపి, డీఈఓ

నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయండి

గీసుకొండ: వచ్చే వానాకాలం కోసం హరితహారం కింద మొక్కల పెంపకానికి నర్సరీలను సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ వీరమల్ల సాయిచరణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. వారం రోజుల్లో సంచుల్లో విత్తనాలు, మొక్కలను నాటాలన్నారు. గ్రామపంచాయతీల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. చేపట్టిన పనుల వద్ద వాటికి సంబంధించిన సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వడ్లూరి ప్రవీణ్‌కుమార్, స్వచ్ఛ భారత్ కన్సల్టెంట్ శ్రీనివాసరావు, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఏపీఓ చంద్రకాంత్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిచరణ్

బేస్‌బాల్ పోటీల్లో అరవింద్‌కు కాంస్యం



వరంగల్ స్పోర్ట్స్: కేరళలో డిసెంబర్ 28 నుంచి 30 వరకు జరిగిన సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో హనుమకొండ వికాస్‌నగర్‌కు చెందిన పిట్టల అరవింద్ కాంస్య పతకం సాధించినట్లు కోచ్ సర్దార్ తెలిపారు. అరవింద్ హైదరాబాద్‌లోని గురు జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. అతడికి కాంస్యం రావడంపై కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములవ్వండి

- ఆటో డ్రైవర్లకు సీపీ రంగనాథ్ పిలుపు

వరంగల్ క్రైం: ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణలో ఆటోడ్రైవర్లు భాగస్వాములు కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నియంత్రణ ఆపరేషన్ రోప్‌వేలో భాగంగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల ఆటో యూనియన్ డ్రైవర్లతో వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నగరంలో ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ట్రాఫిక్ ఏసీపీ పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. సీపీ మాట్లాడుతూ.. ఆటోలను ఎక్కడ పడితే అక్కడ నిలపవద్దని సూచించారు. రోడ్లు వెడల్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆటో స్టాండ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లైసెన్స్ లేనివారికి స్థానిక ఆర్టీఓ అధికారులతో మాట్లాడి ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు డీసీపీ పుష్పారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాబులాల్, రామకృష్ణ, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ ఏవీ.రంగనాథ్

బండ్ పనుల్లో వేగం పెంచండి

- కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: భద్రకాళి బండ్ ఫేస్–2 అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, సకాలంలో పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం బల్దియా, 'కుడా' ఇంజనీర్లతో కమిషనర్ ప్రావీణ్య క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. బండ్‌పై ల్యాండ్ స్కేపింగ్, ఎలక్ట్రికల్, టాయిలెట్, గ్రానైట్ పనులు, జాతీయ జెండా పనుల్ని పరిశీలించారు. 'కుడా' ఆధ్వర్యంలో హంటర్ రోడ్ సీఎస్‌ఆర్ గార్డెన్ ఎదురుగా ఏర్పాటు చేస్తున్న గ్రాండ్ ఎంట్రెన్స్, పోతన రోడ్‌లో ఏర్పాటు చేస్తున్న గ్రాండ్ ఎంట్రెన్స్ పనుల్ని పరిశీలించారు. తనిఖీల్లో బల్దియా ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ రాజయ్య, శ్రీనివాస్‌రావు, సంజయ్‌కుమార్, 'కుడా' ఈఈ భీం రావు, స్మార్ట్ సిటీ పీఎంఈ ఆనంద్ వోలేటి, డీఈ రవికుమార్, ఏఈలు, కాంట్రాక్టర్లు తదితరులున్నారు.



పనుల్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ ప్రావీణ్య, ఇంజనీర్లు

బల్దియాలో మైనార్టీల బారులు

వరంగల్ అర్బన్: మైనార్టీలకిచ్చే ప్రభుత్వ రాయితీ రుణాల కోసం బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో దరఖాస్తుదారులు బారులు తీరారు. వ్యాపార యూనిట్లు, బ్యాంకు లింకేజీ, నాన్ లింకేజీ రుణాల కోసం 'ఆన్‌లైన్'లో నమోదు చేసుకుని, పత్రాలను బల్దియా ఇన్‌వార్డు కార్యాలయంలో సమర్పించారు. దరఖాస్తుదారులతో కార్యాలయ ఆవరణ కిక్కిరిసింది.

దేవాదుల పనుల్లో వేగం పెంచాలి

మంత్రి దయాకర్‌రావు

భక్తులకు సకల సదుపాయాలు

కళాకారుల పొట్టకొడుతున్న సమాచార శాఖ

డిపోలను లాభాల్లోకి తీసుకురావాలి

- వివరాలు 10లో▸

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: మైనార్టీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యకు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా పీజీ, పోస్ట్ డాక్టరోల్ స్టడీస్ కోసం (అమెరికా ఆస్ట్రేలియా, లండన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ న్యూజిలాండ్, సింగపూర్‌లో) ఆర్థిక సహాయం అందించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది ఆగస్టు నుంచి డిసెంబర్ (ఫాల్ సీజన్) కాలంలో అడ్మిషన్ తీసుకున్న అర్హత కలిగిన అభ్యర్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నర్సింగ్ విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్

ఎంజీఎం: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో బుధవారం కాకతీయ మెడికల్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. జపాన్‌లో నర్సింగ్ సేవలు అందించేందుకు ఉత్సాహవంతులైన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు ఈటెస్ట్ నిర్వహించి, అర్హత సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని టామ్‌కామ్ సెంటర్‌లో మూడు నెలలు వృత్తి, భాషా నైపుణ్య తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన 137 మంది నర్సింగ్ విద్యార్థులు ఉపయోగించుకున్నారని, మూడ్రోజుల్లో స్క్రీనింగ్ టెస్ట్ ఫలితాలు విడుదల చేసిన తదుపరి కొత్త బ్యాచ్ ఎంపిక పూర్తి చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి ఆగమ పరీక్షలు

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 6, 7వ తేదీల్లో అర్చక (ఆగమ) పరీక్షలు– 2022 నిర్వహించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అభ్యర్థులకు వరంగల్ మట్టెవాడలోని ఏవీవీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా అర్చక (ఆగమ) పరీక్షల నోడల్ అధికారి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్లలో జరిగే పరీక్షలకు అభ్యర్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరుకావాలన్నారు. కాగా, తొమ్మిదేళ్ల తర్వాత అర్చక (ఆగమ) పరీక్షలు నిర్వహించడం హర్షనీయమని రాష్ట్ర అర్చక, ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. ప్రవేశ వర, ప్రవర పరీక్షలు ఆగమ శాస్త్ర పండితుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన 480 మందికి ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

పోలీసు ఉద్యోగ అభ్యర్థి ఆమరణ నిరాహార దీక్ష



ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన నాగరాజు

దోర్నకల్: మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలంలోని అందనాలపాడు గ్రామానికి చెందిన సండ్లపట్ల నాగరాజు బుధవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాడు. అందనాలపాడు గ్రామంలోని తన ఇంటి ఆవరణలో టెంట్ కింద దీక్ష చేపట్టాడు. ఈ సందర్భంగా నాగరాజు విలేకరులతో మాట్లాడుతూ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలో ఒక మార్కు తక్కువ రావడంతో తాను అర్హత కోల్పోయానని తెలిపాడు. ఏడు మల్టిపుల్ ఆప్షన్స్‌కు సంబంధించిన మార్కులు కలపాలని హైకోర్టు ఆదేశించినా కలపకపోవడంతో తాను ఈవెంట్స్‌లో పాల్గొనే అవకాశం కోల్పోయానని పేర్కొన్నాడు. కాగా, మార్కులు కలపాలనే హైకోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తాను ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినట్లు నాగరాజు వివరించాడు.



గీసుకొండ జాతరకు వేళాయె

6, 7, 8వ తేదీల్లో నిర్వహణ

- గతంలో గుట్ట వద్ద బయటపడిన చారిత్రక ఆనవాళ్లు

వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రం శివారులో నల్లరాతి గుట్టపై స్వయంభు వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి జాతర ఈనెల 6, 7, 8వ తేదీల్లో వైభవంగా సాగనుంది. స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ మేరకు జాతర ఏర్పాట్లను సైతం చేపడుతున్నట్లు ఆలయ వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్తలు వేదాంత మురళీకృష్ణమాచార్యులు, వెంకట నర్సింహాచార్యులు, భరద్వాజాచార్యులు తెలిపారు. చివరి రోజు సాయంత్రం స్వామివారి ఊరేగింపుతో గీసుకొండ వేణుగోపాలస్వామి ఆలయ ప్రవేశం చేయించడంతో జాతర ముగుస్తుందన్నారు.

\- గీసుకొండ



గీసుకొండ గుట్టపై ఆలయం



గీసుకొండ లక్ష్మీనర్సింహస్వామి మూల విరాట్

తరలిరానున్న భక్తులు..

కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఇక్కడి లక్ష్మీనర్సింహస్వామి మహత్యం అనేక కథల రూపంలో ప్రచారంలో ఉంది. గతంలో పురావస్తుశాఖ వారు వెలికితీసిన చారిత్రక ఆనవాళ్లు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. జాతర సందర్భంగా వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లిస్తారు. స్వామి కొలువైన గీసుకొండ గుట్ట వద్ద రెయిలింగ్, మెట్లు, దిగువన ఆలయ నిర్మాణం, పలు అభివృద్ధి పనులను దాతలు ముందుకువచ్చి చేపట్టారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా పరకాల ఎమ్మెల్యే చల్లా ధరారెడ్డి సహకారంతో తగు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ దౌడు బాబు తెలిపారు. అయితే, గుట్టపై ఆలయ అభివృద్ధి, జాతర నిర్వహణపై పెద్దగా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జాతరకు వచ్చేవారికి సరైన సదుపాయాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

చారిత్రక ఆనవాళ్లు..

సుమారు 400 అడుగుల ఎత్తులో ఉన్న గుట్ట చుట్టూ సుమారు 70 ఎకరాల ప్రాంతంలో మధ్యశిలా యుగం మొదలుకొని శాతవాహనుల కాలానికి సంబంధించిన ఎన్నో చారిత్రక ఆధారాలు బయటపడ్డాయి. 2001లో తొలిసారి గీసుకొండకు చెందిన ఔత్సాహిక పురావస్తు పరిశోధకుడు ముత్తినేని రాధాకృష్ణ ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. మధ్యరాతి యుగానికి సంబంధించిన సూక్ష్మరాతి పనిముట్లు, నవీనశిలా యుగానికి సంబంధించిన గొడ్డళ్లు, నూరే రాళ్లు, మట్టి పెంకులు, బృహత్ శిలాయుగపు సమాధులు(మెగాలిథిక్ బరియల్స్) వెలుగు చూశాయి. అలాగే, హైదరాబాద్ నుంచి వచ్చిన పురావస్తుశాఖ వారు పరిశీలన కోసం నాలుగు ట్రెంచ్‌లు తవ్వడంతో మరిన్ని ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. మొదటి ట్రెంచ్‌లో బౌద్ధానికి సంబంధించిన స్థూపం బయటపడింది. దీనికి సంబంధించిన ఇటుకలు కూడా వెలుగు చూశాయి. అందులోనే బోధిసత్వుని తెల్లని ప్రతిమ బయటపడటంతో జిల్లాలోనే మొదటి బుద్ధిస్టు సైట్‌గా దీన్ని గుర్తించారు. దీంతో అప్పట్లో ఈ ప్రాంతం బౌద్ధ ఆరామాలకు నిలయంగా మారి ఉంటుందని పురావస్తు శాఖ నిపుణులు అభిప్రాయపడ్డారు. అలాగే, శాతవాహనులకు సంబంధించిన నాణెం కూడా లభించింది. ఈ విషయం గతంలో పార్లమెంట్‌లో సైతం చర్చకు వచ్చింది. అప్పటి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి అనంతకుమార్ భారత ఆర్కియాలజికల్ సర్వే వారిని గీసుకొండ గుట్ట వద్ద అధ్యయనం చేయాలని ఆదేశించారు. అయితే, అధికారులు వచ్చి వెళ్లాక ఎవరూ పట్టించుకోకపోవడంతో విషయం మరుగునపడింది. ఇక్కడ లభ్యమైన చారిత్రక అవశేషాలు, ప్రతిమలు, టెర్రకోట బొమ్మలు, రాతి ఆయుధాలను వరంగల్ బల్దియా కార్యాలయం వెనకాల ఉన్న పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారు. కాగా, గుట్ట ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి మరింత లోతుగా పరిశోధనలు చేస్తే చారిత్రక క్రమం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

స్పాన్సర్ కోటాకు నోటిఫికేషన్

- 11న కౌన్సెలింగ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని క్యాంపస్ కళాశాలలో వివిధ కోర్సులకు స్పాన్సర్ కోటా నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ బుధవారం తెలిపారు. ఎంఎల్ఐఎస్సీలో 7 సీట్లు,(వార్షిక ఫీజు రూ.35వేలు), ఎమ్మెస్సీ బాటనీలో 4సీట్లు(వార్షిక ఫీజు రూ.48వేలు), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయో టెక్నాలజీలో 6సీట్లు(వార్షిక ఫీజు రూ.46వేలు), ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీలో 6 సీట్లు(వార్షిక ఫీజు రూ.46వేలు) ఉన్నట్లు పేర్కొన్నారు. సీపీ గేట్‌లో అర్హత సాధించిన వారు అర్హులని.. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ.150, ఇతరులు రూ.200 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ఈనెల 11న ఉదయం 11 గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు స్కాలర్‌షిప్‌కు అర్హులు కాదని, స్పాన్సర్ కోటా నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ మేరకు దరఖాస్తుదారులు సంబంధిత స్పాన్సర్ సంస్థల నుంచి సిఫారసు లేఖను జత చేయాలని సూచించారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్

నర్సంపేట రూరల్ : గంజాయి సేవిస్తున్నారనే పక్కా సమచారం మేరకు దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు నర్సంపేట టౌన్ సీఐ పులి రమేష్‌గౌడ్ తెలిపారు. నర్సంపేటలోని మాధన్నపేట రోడ్డులో గల ఆర్యవైశ్య శ్మశానవాటిక వద్ద నర్సంపేటకు చెందిన వేములూరి భానుప్రసాద్, మహ్మద్ రహమత్, జగదీష్ అలియాస్ కోటి గంజాయి సేవిస్తుండగా దాడులు చేసినట్లు తెలిపారు. వీరిలో జగదీష్ పారిపోగా మిగతా ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాసరిపల్లికి చెందిన రాజాలు వద్ద వీరు గంజాయి కొనుగోలు చేసి చేసినట్లు తేలిందన్నారు.

తండ్రిని చంపిన కుమారుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

పాలకుర్తి టౌన్: భూ వివాదంతోపాటు సాగునీటి వాటా కోసం కన్న తండ్రిని చంపిన కొడుకును అరెస్ట్ చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామానికి చెందిన చిడిమిండ్ల నర్సిరెడ్డి(55)కి ఇద్దరు కుమారులు రాజు, రమేష్, కుమార్తె ఉన్నారు. అందరికి వివాహాలు జరిగాయి. నర్సిరెడ్డి తన వ్యవసాయ భూమిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచి ఇచ్చాడు. తన కోసం కొంత భూమిని ఉంచుకున్నాడు. భూ పంపకం విషయంలో తనకు అన్యాయం జరిగిందని పెద్ద కుమారుడు రాజు భావించాడు. తండ్రి చిన్న కుమారుడైన రమేష్‌కు అనుకూలంగా పంపకాలు చేశాడని తండ్రి, తమ్ముడితో తరుచూ గొడవకు దిగేవాడు. ఈ క్రమంలో డిసెంబర్ 28న వ్యవసాయ బావి వద్ద నీటి వాటా విషయంలో తండ్రి, తమ్ముడు రమేష్‌లతో రాజు గొడవపడ్డాడు. తండ్రిని చంపితే సమస్య పరిష్కారమవుతుందని భావించి డిసెంబర్ 29న ఒంటరిగా వ్యవసాయ భూమి వద్ద పనులు చేసుకుంటున్న తండ్రి నర్సిరెడ్డిపై పెద్ద కుమారుడు రాజు దాడికి దిగాడు. నారు మడిలోకి తోసేసి పిడిగుద్దులు గుద్ది గొంతు నులిమి హత్య చేశాడు. రక్తం అంటిన బట్టలను ఇంట్లో దాచి వారం రోజులు ఎవరికి దొరకకుండా తిరిగాడు. నిందితుడు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయి తండ్రిని హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రూ.లక్ష రుణం మంజూరైందని..

- రూ.16,240 కాజేసిన కేటుగాడు
- రఘునాథపల్లిలో సైబర్ మోసం

రఘునాథపల్లి: రూ.లక్ష రుణం మంజూరైందని ఓ మహిళకు మాయమాటలు చెప్పి ప్రాసెసింగ్, ఇన్సురెన్స్‌ల పేర రూ.16,240 కాజేసిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వీరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపల్లికి చెందిన ఓ మహిళ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. డిసెంబర్ 10న మెయిన్ బజార్ ఇండియాలో లోన్ కోసం ఆధార్, పాన్‌కార్డు నంబర్ వివరాలు పంపింది. ఆ తర్వాత గుర్తు తెలియని సదరు మహిళకు వ్యక్తి ఫోన్ చేసి మీకు రూ.లక్ష రుణం మంజూరైనట్లు తెలిపాడు. ప్రాసెసింగ్ ఫీజు రూ.3,250, ఇన్సురెన్స్ అంటూ రూ.12,990 పంపాలని కోరడంతో రెండు సార్లు ఫోన్‌పే ద్వారా పంపించింది. మరోసారి ఫోన్ చేసి రూ.9,000 పంపాలని కోరడంతో మోసపోయినట్లు గుర్తించింది. ఆ తర్వాత ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పు విషయంలో వేధించిన పీఏసీఎస్ చైర్మన్ అరెస్ట్

శాయంపేట : అప్పు విషయంతో వేధించి వ్యక్తి మృతికి కారణమైన హనుమకొండ జిల్లా శాయంపేట మండల పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్‌బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన భూతాల సురేష్ అనే వ్యాపారికి అప్పు నిమిత్తం పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్‌బాబు రూ.20లక్షలు ఇచ్చాడు. కొద్ది రోజులకు అప్పు కట్టాలని కుసుమ శరత్‌బాబు – రమాదేవి దంపతులు సురేష్‌ను మానసికంగా, శారీరకంగా వేధించి ఇంటి డాక్యుమెంట్లు లాక్కున్నారు. దీంతో మనోవేదనకు గురైన సురేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో నిందితుడైన కుసుమ శరత్‌బాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పంట పరిహారం విడుదల

- 2021 డిసెంబర్, 2022 జనవరికిగాను..
- ఉమ్మడి జిల్లాలో 28,567 ఎకరాలకు రూ.13.76 కోట్లు విడుదల
- వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ



తడిసిన మిర్చిని ఆరబెడుతున్న రైతులు (ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: 2021 డిసెంబర్, 2022 జనవరిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కురిసిన వడగండ్ల వాన, ఈదురు గాలులతో మొక్కజొన్న, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు అధికారులు నష్ట పరిహారం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 25,937 మంది రైతులకు సంబంధించిన 28,252.65 ఎకరాలకుగాను రూ.13,76,24,922 పరిహారం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జ డిసెంబర్ 20న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులు ఆర్థికశాఖ నుంచి కలెక్టర్లకు అక్కడి నుంచి వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారుల ద్వారా వారం, పది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమకానున్నాయి.

విడుదలైన పరిహారం వివరాలు (ఎకరాలు)

జిల్లా	రైతులు	మొక్కజొన్న(ఎకరాల్లో)	మిర్చి(ఎకరాల్లో)	వచ్చిన పరిహారం
హనుమకొండ	5,877	1722.3	4517.15	రూ. 3,01,33,380
వరంగల్	16,810	5244.775	13,233.55	రూ. 8,89,43,054
భూపాలపల్లి	2,417	-	2,536.325	రూ.1,36,96,155
మహబూబాబాద్	833	263.14	735.41	రూ.48,52,333
మొత్తం	25,937	7,230.215	21,022.435	రూ.13,76,24,922

పనికి వెళ్లొస్తానని చెప్పి..

- బైక్‌పై వెళ్తుండగా బస్సు ఢీ.. యువకుడి మృతి



కార్తీక్ (ఫైల్)

ఐనవోలు: పనికి వెళ్లొస్తానని చెప్పి బయటకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథినిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. ఉర్సు కరీమాబాద్‌కు చెందిన సంగ కార్తీక్(23) తండ్రి రాజు గతంలో చనిపోయాడు. తల్లి రాణి పున్నేలు క్రాస్ సమీపంలో ఉన్న వృద్ధాశ్రమంలో పనిచేస్తోంది. కార్తీక్ కొద్ది సంవత్సరాలుగా కక్కిరాలపల్లిలో తన పెద్దమ్మ భాగ్యమ్మ వద్ద ఉంటూ వరంగల్‌లోని బేకరిలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పెద్దమ్మ భాగ్యమ్మతో పనికి వెళ్లొస్తానని చెప్పి బైక్‌పై బయలుదేరాడు. పంథిని శివారులోని పెట్రోల్ పంపు వద్ద ఎదురుగా వస్తున్న సత్తుపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ హైర్ చేసుకున్న బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై కార్తీక్ అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సు డ్రైవర్‌ను ఎన్టీఆర్ జిల్లా(పూర్వ కృష్ణ) మునుకోళ్ల మండలం తిరువూరుకు చెందిన దుబ్బాక వెంకయ్యగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గూడూరు: అప్పుల బాధ, అనారోగ్యంతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్రిమిట్ట శివారు తోటదస్రు తండాలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జరుపుల యాకయ్య(30) తనకున్న ఎకరన్నర భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. సరైన దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి కోసం తెచ్చిన రూ.1.50లక్షల అప్పు ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురయ్యాడు. దీనికితోడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పంట చేలో పురుగుల మందు తాగి అక్కడే పడిపోయాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యాకయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మానసిక వేదనతో ఒకరు..



సోమయ్య (ఫైల్)

వర్ధన్నపేట: మానసిక వేదనకు గురై ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేటలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రామారావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుల్ల సోమయ్య(62)– కాంతమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగేళ్లుగా సోమయ్య మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. దీంతో చికిత్స తీసుకుంటూ మందులు వాడుతున్నాడు. అలాగే, వీరి భూమికి వెళ్లడానికి పక్క రైతులతో భూ మార్పిడి చేసుకుని బండి బాట తీసుకున్నారు. దానికి సంబంధించిన కాగితాలు కూడా ఉన్నాయి. అయితే, పక్క రైతులు బాట లేదనడంతో విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పంట పూర్తయ్యాక కొలతలు వేయించి తగాదా తీరుస్తామని వారు చెప్పారు. కాగా, పది రోజుల నుంచి పక్క రైతులు బాట లేదని గొడవ చేస్తుండడంతో సోమయ్య తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. మంగళవారం భార్య కాంతమ్మ వ్యవసాయ పనులకు వెళ్లగా కుమారుడు, కోడలు బ్యాంకు పనిపై వర్ధన్నపేటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వారు ఇంటికి చేరుకోగా సోమయ్య కనిపించలేదు. ఆచూకీ కోసం వెతుకుతున్న క్రమంలో ఇంటి వెనుక ఉన్న ఓ పాత ఇల్లు సమీపాన షెడ్డులో ఉరి వేసుకుని సోమయ్య మృతి చెంది కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి



మురారి (ఫైల్)

గణపురం: బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కర్కపల్లి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన కోపెల మురారి(28) తన తండ్రి కిష్టయ్యను డయాలసిస్ కోసం హనుమకొండలోని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆస్పత్రిలో ఆలస్యం కావడంతో తండ్రిని అక్కడే ఉంచి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని కర్కపల్లి వద్దకు రాగానే భూపాలపల్లి నుంచి ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తల పగిలి మురారి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



అనిల్ (ఫైల్)

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో అయ్యప్ప దేవాలయం సమీపాన జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో అనిల్(35) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

‘అధికారం’ అండతో ఇష్టారాజ్యం..!

- గీసుకొండ ఇన్‌స్పెక్టర్ తీరుపై సర్వత్రా విమర్శలు
- సీపీ చర్యపై హర్షిస్తున్న ప్రజలు
- పలు గ్రామాల్లో బాణసంచా కాల్చి సంబురాలు

వరంగల్ క్రైం/గీసుకొండ: గీసుకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లును సీపీ రంగనాథ్ సస్పెండ్ చేయడంపోలీస్‌శాఖలో సంచలనం రేపింది. దామెర ఎస్సై హరిప్రియతో ఆయన నడిపిన వివాహేతర సంబంధంపై గీసుకొండ మండలంలోనే కాదు వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఎక్కడ చూసినా పోలీసుశాఖ పరువు తీసేలా వ్యవహరించిన తీరును సామాన్యులతోపాటు పలు పార్టీల నాయకులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయడంతో ఏకంగా పలు గ్రామాల్లో బాణసంచా కాల్చి ప్రజలు సంబురాలు జరుపుకున్నారంటే ఆయన విధుల్లో వ్యవహరించిన తీరు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. అయితే, గీసుకొండ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తదుపరి ఆయన పోలీస్‌స్టేషన్ సుందరీకరణ, క్వార్టర్లలో క్రీడా మైదానం, మొక్కల పెంపకం, కొమ్మాల ఆలయం వద్ద వాచ్ పోస్టు ఏర్పాటు చేశారు. వరంగల్–నర్సంపేట రహదారిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి చేపట్టిన చర్యల విషయంలో వెంకటేశ్వర్లుకు మంచి పేరు వచ్చింది. అప్పటి సీపీ తరుణ్‌జోషితోపాటు డీసీపీ వెంకటలక్ష్మి ఆయన పనితీరును అభినందించారు. అయితే, ఆయనలో మరో కోణం కూడా ఉందనే విషయాన్ని పోలీసు శాఖ విస్మరించిందనే ఆరోపణలు ఉన్నాయి. అధికార(అధికారం) పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల అండదండలు తనకు ఉన్నాయని మితిమీరిన తనంతో ఆయన చేసిన పనులు, చేపట్టిన చర్యలు అంతా ఇంతా కాదని పలువురు అంటున్నారు. అలాగే, సదరు ఇన్‌స్పెక్టర్‌కు ఆది నుంచి అధికారుల అండదండలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఓ జిల్లా స్థాయి అధికారి ఆయన ఆగడాలకు వంత పాడారనే ప్రచారం నడుస్తోంది. దీనికి కృతజ్ఞతగా సదరు అధికారి ఇంటి అద్దె, ఇంట్లోకి అవసరమైన సరుకులు తానే చక్కబెట్టేవాడని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ తీసుకున్న నిర్ణయంపై ప్రతిపక్ష పార్టీల వారే కాదు అధికార పార్టీలోని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌స్పెక్టర్ వ్యవహార శైలిపై మచ్చుకు కొన్ని..

- ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వ నుంచి రూ.లక్షల విలువ చేసే మొరాన్ని అక్రమంగా తరలిస్తున్న వారికి అండగా ఉండి వారి నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఇన్‌స్పెక్టర్‌పై బలంగానే ఉన్నాయి.
- గంగదేవిపల్లిలో గతంలో గుప్త నిధుల కోసం చేపట్టిన తవ్వకాల సందర్భంగా అక్రమార్కుల నుంచి ఆయనకు భారీ మొత్తం అందిందనే విషయం అప్పట్లో గుప్పుమంది.
- కొమ్మాల ఆలయం వద్ద ఇటీవల బాల్య వివాహం జరగగా అడ్డుకున్న చైల్డ్ ప్రొటక్షన్ ఫోర్సు, ఐసీడీఎస్ అధికారులకు చుక్కలు చూపించి కేసు నమోదు చేయకుండా తాత్సారం చేసి బాలికను పోలీస్‌స్టేషన్‌లో పెట్టిన విషయంపై సీపీకి పలువురు ఫిర్యాదు చేయడంతో ఆయన మండిపడ్డట్లు తెలుస్తోంది.
- గొర్రెకుంట ప్రగతి పారిశ్రామిక ప్రాంతంలో కొందరి భూమిని కబ్జాదారులు ఆక్రమించగా వారు సీపీని ఆశ్రయించారు. కబ్జాదారులకు అనుకూలంగా ఇన్‌స్పెక్టర్ రూ.లక్షలు తీసుకుని వారి మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. విషయం తెలిసి ఇన్‌స్పెక్టర్‌ను సీపీ మందలించినట్లు సమాచారం.
- సరైన ఆధారాలు లేకుండానే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వేధించాడని బాధితులు చెబుతున్నారు. అలాగే, చిన్నతప్పిదాలకే సామాన్యులపై కేసులు పెట్టి వేధించేవారని పలువురు వాపోయారు.
- కరోనా సమయంలో ఇన్‌స్పెక్టర్ వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చినా విచారణ చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి.
- వరంగల్ – నర్సంపేట రోడ్డులో వ్యాపారులను బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన వ్యాపారులను టార్గెట్ చేసి వేధించినట్లు తెలిసింది.
- పీఎస్‌లోని స్క్రాబ్‌ను విక్రయించినా అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.
- నిఘా విభాగంలో పని చేసే ఓ అధికారి కుటుంబ సభ్యులకు చెందిన వ్యాపారంలో అవకవతకలు జరిగినా వారిని అరెస్ట్ చేయకుండా సదరు అధికారిని అడ్డుపెట్టుకుని తన ఆగడాలు కొనసాగించారని సమాచారం.